ముగిసిన ఉచిత వేసవి శిక్షణ తరగతులు



వేమూరి తాండవకృష్ణతో విద్యార్థులు

కాచిగూడ: చక్కని చేతిరాతతో భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవచ్చని 'బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీ బోర్డు' చైర్మన్, ప్రముఖ చేతిరాత నిపుణులు వేమూరి తాండవ కృష్ణ పేర్కొన్నారు. కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో విద్యార్థులకు చేతిరాతలో 15 రోజుల పాటు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతిరాత చక్కగా ఉంటే భవిష్యత్తు కూడా అంతే చక్కగా ఉంటుందన్నారు. ముత్యాల్లాంటి అక్షరాలు రాయడం వల్ల సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. చిన్నపాటి చిట్కాలతో చేతిరాతను మెరుగుపర్చుకోవచ్చని సూచించారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్, డాక్టర్ జీఎస్. గోపాల్‌రెడ్డి, శ్యామ్ కుమార్, హంస, అమృతరెడ్డి, వెంకట్‌రెడ్డి, అన్విత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

ఆదివాసీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని వినతి



పీఆర్‌సీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మరకాల ప్రసన్నకుమారి

కాచిగూడ: ఆదివాసీ ఉద్యోగుల కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మరకాల ప్రసన్నకుమారి, రాష్ట్ర కోశాధికారి కందుల ఝాన్సీ పీఆర్సీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. పీఆర్‌సీ కమిషనర్ ఎం.శివశంకర్ ఐఏఎస్, మెంబర్ రమణయ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆదివాసి గిరిజన ఉద్యోగులకు అలవెన్స్ పెంచాలని, హెచ్ఆర్ఏ గ్రామీణ ప్రాంతాల్లో 20 శాతానికి పెంచాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగుల పదోన్నతులు ఆలస్యమవుతున్న కారణంగా సీనియార్టీ ప్రాతిపదికన కేడర్ సెపరేషన్ ఇవ్వాలన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌లను 90 నుంచి 180 రోజులకు పెంచాలన్నారు. గ్రాడ్యుటీ రూ.30 లక్షలకు పెంచాలని, కుటుంబ సభ్యులు చనిపోతే ప్రత్యేకంగా 16 రోజుల సెలవులు అనుమతించాలని, దహన సంస్కారాలకు రూ.50వేలు ఇవ్వాలని కోరారు. గత పీఆర్‌సీలో ప్రతిపాదించిన అవకతవకలను సరిదిద్దాలన్నారు.

సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలి

ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్లపై సదస్సు



మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఛత్తీస్‌గడ్‌లో జరుగుతున్న ఆదివాసీల హత్యకాండా, మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ, ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ సంయుక్తాధ్వర్యంలో దండకారణ్యంలో మారణహోమాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ.. సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. ఓ వైపు శాంతి చర్చలు అంటూనే మరోవైపు ఆదివాసీలను శవాలుగా మారుస్తూ.. గుర్తించేందుకు వీలు లేకుండా హత్య చేస్తున్నారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కవి కె.శివారెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు జి.అనురాధ, ప్రొఫెసర్ హరగోపాల్, వేణుగోపాల్, నారాయణరావు, చంద్రశేఖర్, సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ రాష్ట్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ప్రజాగాయని విమలక్క, సామాజిక కార్యకర్త సజయ, రైతు సామాజికవేదిక నాయకులు కన్నెగంటి రవి, మల్లేపల్లి ప్రభాకర్, వివిధ సంఘాల నేతలు క్రాంతి, డీజీ నర్సింహ్మారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

నేత్రపర్వంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నల్లకుంట: నల్లకుంట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా ఆలయం ధ్యానమందిరంలో కన్యకాపరమేశ్వరి జన్మదినం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేసి, హారతి ఇచ్చారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ వేడుకల్లో ప్రాజెక్ట్ చైర్మన్లు జైన శ్రీనివాస్, మహంకాల రమేష్, రామకృష్ణ, చంద్రమౌళి, నల్లకుంట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గజవాడ అంజన్‌కుమార్ గుప్తా, కోశాధికారి ఉప్పల శివకుమార్ గుప్తా, లింగ ప్రకాష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు చలో సెక్రటేరియట్



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయికులు

పంజగుట్ట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే సెక్రటేరియట్ ముట్టడిస్తామని, ఎట్టిపరిస్థితుల్లో ఎన్నికలు జరగనివ్వమని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ హెచ్చరించారు. బీసీ జనసభ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు విలేకరులతో మాట్లాడారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, నాగేంద్ర గౌడ్, పురుషోత్తం పటేల్‌తో కలిసి రాజారాం యాదవ్ మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండగానే జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం, ఎన్నికల కమిషన్ అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వడం వెనక రాజకీయంగా బీసీలను అణగదొక్కే కుట్ర దాగుందన్నారు. బీసీ సమాజం ఇలాంటివి చూస్తూ ఊరుకోదని, వీరి కుట్రలు తిప్పికొడతామని హెచ్చరించారు. వెంటనే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పించకపోతే ఈ నెల 22వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులు, నిరసన ర్యాలీలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, 25వ తేదీన తహసీల్దార్, ఆర్‌డీవో, కలెక్టర్, సర్పంచ్, జెడ్‌పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు వినతిపత్రాలు, జూన్ 8వ తేదీన చలో ఇందిరాపార్క్ బీసీల మహాధర్నా, 15వ తేదీన సెక్రటేరియట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. బీసీ సంఘాల నాయకులు మేకల కృష్ణ, లింగం, మధు యాదవ్, మల్లేష్ యాదవ్, శెట్టి హరికృష్ణ యాదవ్, కొంపెల్లి రాజు, మల్లేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 6 నుంచి మాదిగ జన సభలు

పంజగుట్ట: రాష్ట్రంలో కుల గణన చేపట్టి మాదిగల జనాభా దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ మాదిగ సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి ఇప్పటికే కుల గణన కోసం జీవో విడుదల చేయడం, నిధులు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ మాదిగ సంఘాల నాయకులతో కలిసి మాదిగ సంఘాల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిడమర్తి మాట్లాడుతూ... మంద కృష్ణ మాదిగవల్లే వర్గీకరణ ఉద్యమం ముక్కలయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వ్‌డ్ మూడు స్థానాలు కాంగ్రెస్ మాదిగలకు కేటాయించలేదని, కంటోన్మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. తెలంగాణలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అవసరం ఎందుకో మాదిగ జాతిని చైతన్య పరిచేందుకు ఎన్నికల కోడ్ ముగియగానే జూన్ 6వ తేదీ నుంచి పాత ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా మాదిగల జనసభలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద ఎత్తున మాదిగల జన సభలు ఏర్పాటు చేసి మాదిగలను ఐక్యం చేస్తామన్నారు. సమావేశంలో వివిధ మాదిగ సంఘాల నాయకులు చంద్రశేఖర్, బాలరాజు, మిట్ట యాదయ్య, ముత్యపాల నర్సింగ్‌రావు, మైస ఉపేందర్, కనక వంశీ, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెంటర్ ఫర్ ప్లాంట్ మాలిక్యూలర్ బయోలజీ (సీపీఎంబీ) డైరెక్టర్ డా.రామకృష్ణ రచించిన 'బయో మెడికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ సాలిడ్ కేన్సర్స్' అనే పుస్తకాన్ని వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఎపిడెమియాలజీ, ప్రమాద కారకాలు, రోగ నిర్ధారణ, వర్గీకరణ, జన్యుశాస్త్రం, చికిత్స, ప్రస్తుత సవాళ్లు తదితర కేన్సర్ సంబంధిత వివిధ అంశాలను పుస్తకంలో పొందుబరిచినట్లు రామకృష్ణ తెలిపారు.

నీటి సరఫరా సమస్యపై చర్యలు



సాక్షి
నీటి సరఫరా సమస్య తీరేనా ?

17న సాక్షిలో ప్రచురితమైన కథనం

పర్యటించిన జలమండలి విజ్ఞానపురి సెక్షన్ మేనేజర్



చారీలేన్‌లో పర్యటించిన జలమండలి అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నల్లకుంట: పాత నల్లకుంట డాక్టర్ చారీలేన్‌లో గత రెండేళ్లుగా నల్లా ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. స్థానికులు పలుసార్లు జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేదని ఈనెల 17న 'నీటి సరఫరా సమస్య తీరేనా' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జలమండలి విజ్ఞానపురి సెక్షన్ మేనేజర్ జాకీర్ సిబ్బందితో కలిసి శనివారం పర్యటించారు. ఎక్కడ నీరు కలుషితమవుతుందో తెలుసుకునేందుకు పైప్ లైన్ ఉన్న చోట తవ్వారు. లీకేజీలు ఉన్న చోట మరమ్మతులు చేపడతామని, అవసరమైతే కొత్తపైపులు వేస్తామన్నారు. భవిష్యత్తులో ఈ సమస్య పునరావృతం కాకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారని స్థానికులు చెప్పారు.

సుందరయ్య పార్కు సమస్యలు పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో నెలకొన్న సమస్యలపై 'హైదరాబాద్ జిందాబాద్' ప్రధాన కార్యదర్శి వీరయ్య జీహెచ్ఎంసీ కమిషనర్, అడిషనల్ కమిషనర్, యూబీడీ అధికారులకు ఆన్‌లైన్, ట్విటర్ ద్వారా ఫిర్యాదు చేశారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ప్రతినిధులు లక్షలాది రూపాయలు వెచ్చించి పార్కును ఆధునీకరించిన చిన్నపాటి వర్షానికే చిత్తడవుతున్నాయన్నారు. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యేక పూజలు



ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ విజయం సాధించాలని అడిక్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్ భవానిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం తప్పకుండా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



నింబొలిఅడ్డలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: నింబోలిఅడ్డలో సీసీరోడ్డు పనులు జాప్యం అవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డ లాల్ బహదూర్ హైస్కూల్ పక్కలేన్‌లో ఆమె పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్డు విషయంలో జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. బీజేపీ నేతలు మల్లికార్జున్, ఆర్.సంతోష్, రమాదేవి, వరలక్ష్మి, రవియాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు సన్మానం



కాంగ్రెస్ సీనియర్ నాయకులను సన్మానించిన దృశ్యం

నల్లకుంట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రచారం చేసిన పార్టీ సీనియర్ నాయకులను శనివారం సన్మానించారు. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి గొల్లపల్లి దయానంద్ అధ్యక్షతన టీపీసీసీ కార్యదర్శి అజయ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, శ్యామ్‌రావు, విజితారెడ్డిలను సన్మానించారు. టీపీసీసీ కార్యదర్శి రాజేందర్‌యాదవ్, నర్సింగ్‌రావు, తుల్జాభవాని ఆలయ చైర్మన్ పరమేష్, శరత్, రామ్మోహన్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేటిక్ టెక్నాలజీ విభాగంలో హరిసింగ్ రత్నావత్‌కు పీహెచ్‌డీ లభించింది.సీనియర్ అధ్యాపకులు ప్రొ.వీ బీ నరసింహ పర్యవేక్షణలో నెట్‌వర్క్ ఇన్‌స్ట్రూషన్ డిటెక్షన్ ఇన్ హనీ పాట్ ఫ్రేమ్ వర్క్ యూజింగ్ ఏ.ఐ మోడల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. సూర్యాపేట జిల్లా చివ్వెముల మండలం ఎంజీనగర్ తండాకు చెందిన హరిసింగ్ ఎంపీఏ చేస్తూ తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు.

'ప్రధాని, అమిత్‌షాలు అబద్ధాల ప్రచారం'

నల్లకుంట: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు అబద్ధాలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండిపడ్డారు. శనివారం నల్లకుంటలోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ కార్యదర్శి అజయ్‌కుమార్, ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీసెల్ మాజీ చైర్మన్, శ్యామ్‌రావు, సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి మాట్లాడారు. మోదీ తప్పుడు నిర్ణయాలతో 900 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గెలిచే పరిస్థితి లేదని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఒక్క పార్లమెంట్ సీటు కూడా రాదని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. వారు మానసిక వైద్య చికిత్సలు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో 9 నుంచి 14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటుందని సీఎం, ఇంటలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్. మురళీకృష్ణ, ఎడ్ల నరేందర్‌రెడ్డి, చింతల ధనార్జున్ రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, విశ్వేశ్వరరావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. జలమయమైన లోతట్టు ప్రాంతాలు



మహంకాళి ఆలయం వద్ద వరద నీటిని తొలగింపజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. శనివారం కురిసిన వర్షం కారణంగా అంబర్‌పేటలో పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బాగ్ అంబర్‌పేటలోని బుర్జు గల్లీ, మహంకాళి ఆలయం సమీపంలో నీరు భారీగా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అక్కడికి చేరుకుని జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం అందించారు. శంకర్‌నగర్, అలీకేఫ్ తదితర ప్రాంతాల్లో వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

మజ్జిగ ప్రభాకర్‌రెడ్డికి ఘన నివాళి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి మాజీ కార్పొరేటర్ మజ్జిగ ప్రభాకర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ బి-బ్లాక్ అధ్యక్షుడు అంజి యాదవ్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వద్ద మాజీ కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి మూడో వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభాకర్‌రెడ్డి గొప్ప ప్రజానాయకుడని పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. నాయకులు కుంబర్తి శివకుమార్, బబ్లూ, కన్న, నవీన్‌నాయక్, రమేష్, ప్రేమ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'కాఫీ టేబుల్ బుక్' ఆవిష్కరణ



కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్తి సమాచారాన్ని తెలియజేసే కాఫీ టేబుల్ బుక్‌ను వీసీ ప్రొ.రవీందర్ ఆవిష్కరించారు. శనివారం పాలన భవనంలోని సెనెట్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్ బుక్ ప్రాధాన్యతను వివరించి ఆవిష్కరించారు. వివిధ పనుల కోసం ఓయూను సందర్శించే వారి కోసం వీసీ చాంబర్‌తో పాటు రిజిస్ట్రార్ ఇతర అధికారులు, ప్రిన్సిపల్స్ కార్యాలయాల్లోని టేబుళ్లపై కాఫీ బుక్‌ను అందుబాటులో ఉంచుతారు. ఓయూను పర్యవేక్షించేందుకు వస్తున్న యూజీసీ న్యాక్, ఇతర సంస్థల అధికారుల బృందానికి సైతం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు, ప్రింటింగ్ ప్రెస్ మాజీ డైరెక్టర్ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.స్టీవెన్ సన్, పీఆర్వో ప్రొ.ప్యాట్రిక్, ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి పాల్గొన్నారు.

రైళ్లలో మరిచిపోయిన వస్తువుల అప్పగింత



బ్యాగులను అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

అడ్డగుట్ట: రైళ్లలో ప్రయాణికులు మరిచిపోయి, పోగొట్టుకున్న వస్తువులను భద్రంగా యజమానులకు అందజేస్తున్నామని ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎంవీ రెడ్డి పేర్కొన్నారు. ఆపరేషన్ అమానత్‌లో భాగంగా 2024లో ఇప్పటి వరకు ప్రయాణికులు మరిచిపోయిన, పోగొట్టుకున్న సుమారు రూ. 17.13 లక్షల విలువగల సామగ్రిని ఇతర వస్తువులను యజమానులను అప్పగించినట్లు చెప్పారు.

- మహారాష్ట్రకు చెందిన అచాల అశోక్ శుక్రవారం రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా అతడి రూ. 2 వేల విలువ గల ఇయర్ ఫోన్స్ మర్చిపోయాడు. ఆర్పీఎఫ్ పోలీసులు సదరు ఇయర్ ఫోన్స్‌ను ఆర్పీఎఫ్ కార్యాలయానికి తీసుకొచ్చి భద్రపరిచారు. శనివారం ఇయర్ ఫోన్స్ యజమానిని గుర్తించిన పోలీసులు ఆయనకు అందజేశారు.
- వరంగల్ రైల్వేస్టేషన్‌లో వాటర్ బాటిల్ కోసం రైలు దిగి లగేజీ బ్యాగును పోగొట్టుకున్న ప్రయాణికుడి బ్యాగులను స్వాధీనం చేసుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సదరు యజమానికి అప్పగించారు.
- ఆదిలాబాద్‌కు చెందిన గణేష్ సర్దార్ అనే వ్యక్తి సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా వరంగల్ స్టేషన్‌లో వాటర్ బాటిల్ కోసం రైలు దిగాడు. ఈ క్రమంలో రైలు వెళ్లిపోవడంతో స్థానిక రైల్వే పోలీసులకు విషయం చెప్పడంతో వెంటనే పోలీసులు సదరు యజమాని బ్యాగును సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. శనివారం సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ కార్యాలయంలో యజమానికి బ్యాగులను అప్పగించారు.

నేడు ఉచిత ఆరోగ్య శిబిరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేడు ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో సీనియర్ ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ శ్రీనివాస్, కంటివైద్యులు కులశేఖర్, నిలోఫర్ ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యులు కేవీఎస్ నారాయణ, ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్లు శ్రీవర్ధన్, సుధీర్‌తో పాటు వైద్యనిపుణులు పాల్గొంటారన్నారు. ఈ శిబిరంలో మధుమేహం, బీపీ, స్క్రీనింగ్ పరీక్షలతో పాటు నేత్ర, రక్త పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పిల్లలకు ఆరోగ్య సంబంధమైన పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

24న నారద జయంతి

కాచిగూడ: సమాచార భారతి ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే నారద జయంతి వేడుకలను ఈనెల 24న రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏపీ రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయ రంగంలో విశేష సేవలందిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ఫోటోగ్రాఫర్లు, యువ, మహిళా జర్నలిస్టులు, కాలమిస్టులకు నారద పురస్కార ప్రదానోత్సవం ఉంటుందన్నారు. పాత్రికేయులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అలరించిన హిందీ సినీసంగీత విభావరి

చిక్కడపల్లి: 'సుర్ సంగీత్ మ్యూజికల్ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్' ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో కళా వేంకటదీక్షితులు హాల్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన హిందీ గీతాల సినీసంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ గాయకుడు శ్యామ్ కిషోర్ షిండే, చాంపదత్త, కబిత ప్రదాన్‌లు ఆలపించిన హిందీ సినీగీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గాయకులను శ్యామ్‌కిషోర్‌షిండే, చాంపదత్త, తబిత ప్రదాన్‌లను ఈ సందర్భంగా అభినందించారు.

నూతన రిజర్వైర్ మేనేజర్‌కు సన్మానం



సన్మానిస్తున్న సయ్యద్ పర్వేజ్

ముషీరాబాద్: ప్రజల సహకారంతో ముషీరాబాద్‌లో నెలకొన్న తాగునీటి, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముషీరాబాద్ జలమండలి మేనేజర్ సురేష్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వైర్ ముషీరాబాద్ సెక్షన్ నూతన మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను స్థానిక బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫర్వేజ్ ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నీటి, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానన్నారు. రిజర్వైర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి జర్నలిజం నాల్గో స్తంభం

చిక్కడపల్లి: ప్రజాస్వామ్యానికి జర్నలిజం నాల్గో స్తంభం వంటిదని తెలంగాణ ఏసీబీ డైరెక్టర్ సీవీ ఆనంద్ అన్నారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగుడాకుల బాలస్వామి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అఖిలేష్ శనివారం ఏసీబీ కార్యాలయంలో సీవీ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు అసోసియేషన్ రూపొందించిన ఉగాది డైరీని వారికి అందజేశారు. ఈ సందర్భంగా సీవీ మాట్లాడుతూ.. జర్నలిస్టులు, ప్రసార మాధ్యమాలు లేకుంటే సమాజ మనుగడ ప్రశ్నార్థకమన్నారు. నిబద్ధతగల జర్నలిస్టులతో ఉన్నతమైన సమాజం నిర్మాణం అవుతుందని అభిప్రాయపడ్డారు.

రాయబరేలీలో స్థానిక నేతల ప్రచారం



ప్రచారంలో వేణుగోపాల్, టీపీసీసీ కార్యదర్శి యాదగిరిగౌడ్

నల్లకుంట: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ కార్యదర్శి యాదగిరిగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం రాయబరేలీలో రాహుల్‌గాంధీకి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి హస్తం గుర్తుకు ఓటేసి రాహుల్ గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటే త్యాగాల పార్టీ అని, యావత్ దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారన్నారు. టీపీసీసీ కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు నాగభూషణం, కైలాసపతిగౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ గొడవలో ముగ్గురిపై కేసు

కాచిగూడ: కృష్ణానగర్‌లో జరిగిన గొడవలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కాచిగూడ ఎస్సై హెచ్.నరేష్‌కుమార్ తెలిపారు. నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన సచిన్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన శ్రవణ్ జన్మదిన వేడుకలకు హాజరయ్యాడు. రాత్రి కావడంతో కూల్ డ్రింక్స్ తెచ్చుకోవడానికి కృష్ణానగర్ వైపు వెళ్తుండగా.. రోడ్డుపై ఉన్న స్థానికులైన నిఖిల్, మోతిన్, ఇమ్రాన్‌లు ఇటువైపు ఎందుకు వచ్చావని గొడవకు దిగారు. దీంతో సచిన్ కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గొడవకు కారణమైన ముగ్గురిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయంపై కూలిన చెట్ల కొమ్మలు



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని ప్రసిద్ధిగాంచిన ఈదమ్మ దేవాలయంపై చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు దేవాలయానికి ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలు విరిగి ఆలయంపై ఉన్న రేకుల షెడ్డుపై పడ్డాయి. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి విరిగిపడిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని భక్తులు కోరుతున్నారు.